క్లుప్తంగా

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

చొప్పదండి: భూ భారతి దరఖాస్తులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో మహేశ్వర్‌తో కలిసి శుక్రవారం భూభారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన అంశాలపై తహసీల్దార్ నవీన్‌కుమార్‌తో చర్చించారు. రెవెన్యూ పరిశీలకులు మోహన్‌రెడ్డి, త్రిపాల్ సింగ్, తదితరులున్నారు.

డ్రోన్‌తో యూరియా పిచికారీ



పిచికారీని పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో శుక్రవారం వరిలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ చేశారు. మెట్‌పల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డెమోను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఎక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేసిన రైతులు డ్రోన్‌తో స్ప్రే చేసుకుంటే కూలీల ఖర్చు తగ్గుతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు సూచన మేరకే ఎరువులు వాడుకోవాలన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో విండో చైర్మన్ పొద్దుటూరి సంజీవరెడ్డి, ఏడీఏ శ్రీధర్, ఏవో వెంకటేశ్, సీఈవో సదయ్య, డైరెక్టర్‌లు బోడ సుధాకర్, ఐలయ్య, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

జమ్మికుంటరూరల్: మండలంలోని బిజిగిరిషరీఫ్, వావిలాల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సభ్యులు పర్యటించారు. పారిశుధ్యం, తాగునీటి వసతులు, తడి,పొడి చెత్త సేకరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే నిర్వహించారు. కేంద్ర బృందం సభ్యులు దుర్గెటి మంజుల, పూసాల రజిత, ఇంచార్జి ఎంపీడీవో బాదావత్ వెంకటేశ్వర్లు, ఎస్బీఎం కోఆర్డినేటర్లు వేణు, రమేష్, ప్రత్యేకాధికారులు రమ, శ్రీనివాస్, కార్యదర్శులు గుర్రం రాము, ఇంగ్లే రాజు, ఆరోగ్యశాఖ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుండాలి

గన్నేరువరం: రాజకీయ నాయకులు అభివృద్ధిలో ముందుండాలని సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో మాట్లాడారు. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేల మాటలు మితిమీరిపోతున్నాయని, దిగజారుడు వ్యాఖ్యలతో సమాజానికి ఉపయోగం లేదని, వ్యక్తిగత విమర్శలకు తావు లేకుండా, అధికార, ప్రతిపక్షాలు మండల అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పాలనలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి సహకారం ఉంటుందన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి శ్రీశైలం, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, యువజన నాయకులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

హుజూరాబాద్: సోషల్ మీడియాపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఉన్న ప్రేమ నియోజకవర్గ ప్రజలపై లేదని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు.
ఇల్లందకుంట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చారిత్రాత్మకమని ప్రణవ్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో సంబురాలు జరుపుకున్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



చొప్పదండిలో రెయిన్ కోట్లు అందిస్తున్న కమిషనర్ నాగరాజు, బీజేపీ నాయకులు

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయంలో పూజల్లో చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్, పరీక్ష ప్యాడ్స్, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో మంత్రి చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఆయా గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. బండి సంజయ్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకున్నారు. అక్కడక్కడ రెడ్‌క్రాస్ సొసైటీ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు.

ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



మానకొండూర్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



హుజూరాబాద్‌రూరల్: చెల్పూర్‌లో...



శంకరపట్నం: తాడికల్‌లో...

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ పీహెచ్‌సీ డాక్టర్ మధు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని వైద్య, ఆ రోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది విజయేందర్‌రెడ్డి తదితరులున్నారు.
జమ్మికుంట: పట్టణంలోని వీధుల్లో వావిలాల పీహెచ్‌సీ డా.చందన ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. పెరుగుతున్న జనాభా సవాళ్లు, ప్రభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, అరుణ, కుసుమకుమారి, సదానందం, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, ఆరోగ్యశాఖ సిబ్బంది నరేందర్, సరళ, ముంజుల, సాజిదా పర్వీన్, సావిత్రి, రజిత, సంధ్యా, వాణి, రాధా ఆశాలు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ డా. రమేష్ మాట్లాడుతూ ఆర్థిక అభివృద్ధిలో మానవ వనరుల పాత్ర కీలకమన్నారు. జంతు, అర్థశాస్త్ర విభాగాధిపతులు గణేష్, రాజేంద్రం, అధ్యాపకులు మాధవి, సుష్మ, శ్రీనివాస్, శ్యామల, రవి, శ్రీనివాస్‌రెడ్డి, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.
మానకొండూర్: ఒకరు ముద్దు ఇద్దరు వద్దు అనే నినాదంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి సుధా రాజేందర్, వైద్యాధికారి సల్మాన్, సీహెచ్‌వో రాజునాయక్, వైద్యసిబ్బంది జుబేర్, స్నేహలత, మునీందర్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.
శంకరపట్నం: కేశవపట్నం, తాడికల్ గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. తాడికల్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో వైద్యాధికారి శ్రావన్‌కుమార్ సీజనల్ వ్యాధులు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధిక జనాభా అనర్థాలకు మూలం, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం, జనాభా పెరుగుదల మానవప్రగతికి అరుగుదల నినాదాలతో ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామంలో 12 మంది నిరుపేదలకు నివాస స్థలాలను కేటాయిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. స్థలం లేనివారికి నివాస స్థలం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సహకారాన్ని ప్రశంసించారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో విజయ్, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, రమణారెడ్డి, ఎస్ఎల్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ నూతన పాలకవర్గం

మండలంలోని నల్లగొండ గ్రామంలో శ్రీసీతారామ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానం నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆలయ చైర్మన్ బండారిపెల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు గాజుల అంజయ్య, బూత్కూరి శ్రీనివాస్, కవ్వంపల్లి మహేశ్, జినుక శ్రీనివాస్, గోలి లక్ష్మి, కందుకూరి లక్ష్మీరాజం, దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగుల అనిల్ కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీ పేరంబుదూర్ రామాచార్యులు, లక్ష్మణ్ చార్యులు, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎల్. గౌడ్, నాయకులు మోరపల్లి రమణారెడ్డి, కుంట రాజేందర్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, కొండల్ రావు, మాచర్ల అంజయ్య, చింతల లక్ష్మారెడ్డి, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి

మానకొండూర్: వన మహోత్సవంలో భాగంగా మానకొండూర్‌లోని చెరువు గట్టు, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అదనపు కలెక్టర్ అశ్వినీ తనాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. రోజురోజుకు కాలుష్యం పెరిగిపోతుందని, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడకుండా విరివిగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనంతోనే కాలుష్యం నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



హుజూరాబాద్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
శంకరపట్నం: ఆముదాలపల్లి, మొలంగూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నామని ఏఈ రఘు తెలిపారు. మొలంగూర్, మొలంగూర్ ఇండస్ట్రియల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి, ఆముదాలపల్లి, రాజాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగ దారులు సహకరించాలని కోరారు.

సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ బస్‌స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపోలకు చెందిన 55 మంది డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. సురక్షిత డ్రైవింగ్, వర్షాకాలంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీసీ రూపొందించిన కరపత్రాలను కరీంనగర్ జిల్లా రవాణా అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్.భూపతిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) పి.మల్లేశం, సేఫ్టీ వార్డెన్స్ శేఖర్‌తో పాటు వివిధ డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

మెట్టప్రాంతానికి కాళేశ్వరం జలాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: గన్నేరువరం మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. గన్నేరువరం మండలం ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మెట్టప్రాంతం మిడ్ మానేరు ప్రాజెక్టు ద్వారా కాళేశ్వరం జలాలను తీసుకువచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. గుండ్లపల్లి నుంచి ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణంపై నిర్లక్ష్యానికి నిరసనగా శనివారం నిర్వహించాల్సిన బైక్ ర్యాలీకి అనుమతి లేనందున్న వాయిదా వేశామన్నారు. ఆగస్టు 12న నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. సమావేశంలో రాజన్నసిరిసిల్ల జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు గంప వెంకన్న, కరివేద మహిపాల్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, లక్ష్మన్, సుధాకర్, ప్రభాకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాలు

చొప్పదండి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయ విద్యా సమితి జగిత్యాల జిల్లాకు ఈ ఏడాది నుంచి జవహర్ నవోదయను మంజూరు చేసి ప్రారంభించగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేసి జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు చొప్పదండిలోని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు అభ్యర్థుల హాల్ టికెట్ల జాబితాను విడుదల చేశారు. అర్హత సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ప్రిన్సిపాల్ మంగతాయారు అభినందనలు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 14న ఉదయం హాల్ టికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

ఎంపికైన విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు

- ఓపెన్ అన్ రిజర్వ్‌డ్ సీట్లు : 3590066, 3590160, 3590645, 3593160
- ఓపెన్ బ్యాక్‌వర్డ్ క్లాస్ : 3589856, 3592729, 3592749
- ఓపెన్ షెడ్యూల్డ్ క్యాస్ట్ : 3589894, 3592748
- ఓపెన్ షెడ్యూల్డ్ ట్రైబ్ : 3592875
- రూరల్ ఓపెన్ సీట్లు : 3589860, 3590114, 3590572, 3590755, 3590800, 3592242, 3592245, 3592289, 3592680, 3592986, 3593145, 3593163, 3593200
- రూరల్ బీసీ సీట్లు : 3589788, 3589844, 3589971, 3590146, 3590232, 3590404, 3590499, 3592935
- రూరల్ ఎస్సీ సీట్లు : 3590015, 3590046, 3590230, 3590462, 3592230, 3592296
- రూరల్ ఎస్టీ సీట్లు : 3590293, 3592980, 3593004

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ నాగరాజు

చొప్పదండి: పట్టణంలో తడి, పొడిచెత్త వాహనాలను ప్రారంభించగా శుక్రవారం వాటి పనితీరును మున్సిపల్ కమిషనర్ నాగరాజు పరిశీలించారు. పట్టణంలోని 14వ వార్డులలో ప్రతిరోజు చెత్త సేకరణకు ఆటోలు తిరుగుతాయని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని సూచించారు. ప్రజలు పట్టణ శుభ్రతకు సహకరించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

రెడ్‌జోన్‌లో విక్రయాలు నిషేధం

పట్టణంలోని రెడ్‌జోన్లలో వీధి విక్రయదారులు విక్రయాలను నిలిపివేయాలని కమిషనర్ నాగరాజు, ఎస్ఐ నరేశ్ రెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం వీధి విక్రయదారుల కమిటీ సమావేశం నిర్వహించారు. గుమ్లాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి జవహర్ నవోదయ విద్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా స్థలాన్ని, తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రెడ్‌జోన్‌గా నిర్ణయించామని, వివేకానంద చౌరస్తా నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు రిస్ట్రిక్టెడ్ జోన్‌గా, తహసీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు, గాంధీనగర్ నుంచి రైతు వేదిక వరకు, అంబేడ్కర్ చౌరస్తా నుంచి భూపాలపట్నం రోడ్డును గ్రీన్‌జోన్‌గా నిర్ణయించామన్నారు. వీధి విక్రయదారులు గ్రీన్‌జోన్‌లో విక్రయాలు జరపాలని, రెడ్‌జోన్‌లో అనుమతి లేదని, నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ డి. ప్రశాంత్, మెప్మా టీఎంసీ అనిత, జూనియర్ సహాయకులు శ్రీధర్ రెడ్డి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు కనుకలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర: పల్లెల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లి, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. గత బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, ఒద్యారం మాజీ సర్పంచ్ మునుకుంట్ల సంపత్ ప్రభుత్వ పాఠశాలకు సమకూర్చిన టీవీ, వాటర్‌ప్యూరిఫైయర్, బీరువా, విద్యార్థులకు షూ, స్పోర్ట్స్ డ్రెస్సులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ చైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, వెలిచాల తిరుమల్‌రావు, వేములభాస్కర్, పురమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, బూర్గు గంగన్న, అజయ్‌రావు, రోమాల రమేష్, సాయిగౌడ్, గజ్జల బాపురెడ్డి, పడితపల్లి కిషన్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన కూన సాయిబాబా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 1997–98 పదో తరగతి క్లాస్‌మేట్స్, స్నేహితులు రూ.1.8 లక్షలు పోగు చేసి వైద్యఖర్చుల నిమిత్తం శుక్రవారం సాయిబాబా భార్య రజితకు అందజేశారు. సాయం అందించిన వారిలో బూడిద సదాశివ, అందె చిన్నస్వామి, మేకల కుమార్, వొద్దిరాల విజయ్‌కుమార్, పులి శ్రీనివాస్, అంతగిరి సాయిలు, సుతారి శ్రీనివాస్, బూడిద బాలు పలువురు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **మొక్కలను సంరక్షించాలి**

రామడుగు: మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించాలని కరీంనగర్ ఎఫ్ఆర్వో షౌకత్‌హుస్సేన్ సూచించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెదిర ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎఫ్ఆర్వో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, తద్వార ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారులు బాపురాజు, నర్సింగరావు, సెక్షన్ అధికారులు శేఖర్, అనంతరాములు, ఏపీవో రాధ, హెచ్ఎం కోట రాజమౌళి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**

చిగురుమామిడి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య కోరారు. శుక్రవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, అత్యధిక సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. గ్రామశాఖల అధ్యక్షులు శివప్రసాద్, జనార్దన్‌రెడ్డి,తిరుపతి, తిరుపతిరెడ్డి, రమేశ్, ఎస్కె సిరాజ్‌పాషా, సన్నీల్ల వెంకటేశం, కలువల సంపత్‌రెడ్డి, ఎండ్ర నారాయణ, కొమ్ము కొంరయ్య, రావుల వెంకన్న, పిల్లి వేణు, కత్తుల రమేశ్, బిల్లా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **పోలీసుల తనిఖీ**

చిగురుమామిడి: మండల కేంద్రంలో ఎస్ఐ సాయికృష్ణ ఆధ్వర్యంలో వివిధ షాపుల్లో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి విక్రయిస్తున్నారనే అనుమానంతో తనిఖీ చేశామన్నారు. మత్తుపదార్థాల విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

- **ఎంఈవో విచారణ**

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఓ ప్రయివేటు స్కూల్‌లో ఎంఈవో హేమలత శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యార్థికి టీసీ ఇవ్వడం లేదని మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి హెచ్ఆర్‌సీలో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుడి వివరాలు తీసుకొని విచారణకు హాజరు కావాలని కోరినా హాజరు కాలేదన్నారు. అనంతరం స్కూల్ రికార్డులను పరిశీలించి, హెచ్ఆర్‌సీ ప్రతినిధులుకు వివరాలు అందించామని ఎంఈవో హేమలత తెలిపారు.

- **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

జమ్మికుంట: వసీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో వందరోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆర్పీలు, సంఘ సభ్యులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళ, శుక్రవారం డ్రై డే చేపట్టాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, సీఎల్ఆర్పీ మంజుల, శానిటరీ జవాన్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

- **అసత్య ఆరోపణలు మానుకోవాలి**

జమ్మికుంట: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అసత్య ఆరోపణలు మానుకోవాలని జమ్మికుంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య అన్నారు. పట్టణంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాటలు ఉపసంహరించుకోవాలన్నారు.

- **సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

ఇల్లందకుంట: మండల కేంద్రంలో 17 మంది లబ్ధిదారులకు రూ. ఏడు లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఆదర్శమైన ప్రజాపాలన అందిస్తుందన్నారు.

- **విద్యార్థులకు షూ**

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థులకు షూ, సాక్సులు అందజేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అంబటి వేణుకుమార్, నేరెళ్ల కవిత రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **కుట్టుమిషన్లు పంపిణీ**

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉమెన్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరు కుట్టు మిషన్లు వితరణ చేశారు. సొసైటీ చైర్మన్ జమునారాణి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యను నేర్చుకోవాలని సూచించారు. పాఠశాలకు అందజేసిన కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, కృష్ణ, పాఠశాల హెచ్ఎం అనితాకుమారి, పీడీ బాబుశ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **సన్మానం**

హుజూరాబాద్: పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమ నేత, గెజిటెడ్ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ వేల్పుల రత్నం ఇటీవల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో రత్నంను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ ఉద్యోగులు శాలువాతో సత్కారించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

- **కాంగ్రెస్ నాయకుల సంబురాలు**

మానకొండూర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించడం పట్ల కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

- **రామంచలో ఉర్సు**

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామంలో శుక్రవారం ఉర్సు ఘనంగా నిర్వహించారు. దర్గా నిర్వాహకుడు కరీంఖాన్ ఆధ్వర్యంలో మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. ఆయా గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్గాను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- **కథా సంపుటి ఆవిష్కరణ**

హుజూరాబాద్: పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత రావుల పుల్లాచారి రచించిన «గుప్పెడు గంధం» కథా సంపుటిని శుక్రవారం హైదరాబాద్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుల్లాచారి కలం నుంచి ఎన్నో కథలు వెలువడ్డాయని, హృదయాన్ని కదిలించే ఎన్నో కథలు రాశారని ప్రశంసించారు.

- **జెడ్పీహెచ్ఎస్‌లో వన మహోత్సవం**

హుజూరాబాద్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. అటవీశాఖాధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ కలిసి పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటారు.

- **బోనాల వేడుకలు**

రామడుగు: మండలంలోని విన్నర్స్ పాఠశాలలో శుక్రవారం బోనాల వేడుకలు, ఆషాఢ మాసం సందర్భంగా గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల–జగన్మోహన్‌గౌడ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగలపై అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం పండుగలు ఆవశ్యత గూర్చి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
చొప్పదండి: పట్టణంలోని లిటిల్స్ ఐలాండ్ స్కూల్‌లో శుక్రవారం బోనాల వేడుక నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో ర్యాలీ నిర్వహించారు. క కరస్పాండెంట్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
హుజూరాబాద్: పట్టణంలోని కాకతీయకాలనీ మాంటిస్సోరి స్కూల్‌లో గోరింటాకు పండుగ నిర్వహించారు. గోరింటాకు పండగ జరుపుకోవడం ఆనందంగా ఉందని హెచ్ఎం గీతాషాజు అన్నారు.

- **రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు**

మానకొండూర్: కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దపల్లి జిల్లాకు చెందిన అనిల్(20) మానకొండూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. రోడ్డు దాటుతుండగా బస్సు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. స్థానికులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

- **విద్యుదాఘాతంతో ఆవు మృతి**

జమ్మికుంటరూరల్: శాయంపేటకు చెందిన రైతు లింగంపల్లి కిషన్‌రావు ఆవు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి మేతకు వెళ్లగా షాక్ తగిలింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.